సాక్షి
అనంతపురం

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



'అనంత'లో నకిలీ వైద్యులు
ప్రజల ఆరోగ్యాలతో నకిలీ వైద్యుల జంట చెలగాటమాడుతోంది. రోగం లేకున్నా ఉన్నట్లు నిర్ధారించి డబ్బు దోచేస్తోంది. 8లో



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో ఆదివారం టమాట కిలో ధర గరిష్టం రూ.10, కనిష్టం రూ.3.50, సరాసరి రూ.6.50 చొప్పున పలికింది.

గరిష్టం/కనిష్టం
34.3°/ 22.5°
జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నేడు 'స్పందన' ఉండదు



అనంతపురం అర్బన్: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన 'స్పందన' కార్యక్రమాన్ని కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు రద్దు చేసినట్లు డీఆర్‌ఓ గాయత్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

విత్తన నాణ్యతలో రాజీపడొద్దు



విత్తన పప్పుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న ఏడీఏ

అనంతపురం అగ్రికల్చర్: రబీ పంటల సాగుకు సంబంధించి రైతులకు 40 శాతం రాయితీతో పంపిణీ చేయనున్న విత్తన పప్పుశనగ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని వ్యవసాయశాఖ ఏడీఏ రవి ఆదేశించారు. ఆదివారం నగరంలోని జశ్వంత్ సీడ్స్ ప్లాంట్‌లో విత్తనశుద్ధి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటించి రైతులకు మంచి విత్తనం ఇవ్వడానికి అందరూ సహకరించాలని కోరారు.

పండుగలా పింఛన్ల పంపిణీ



అనంతపురం ఒకటో డివిజన్‌లో సుధాకర్‌కు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రావణి

అనంతపురం: జిల్లాలో ఆదివారం పింఛన్ల పంపిణీ పండుగలా సాగింది. వైఎస్సార్ పింఛన్ కానుకను ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు తెల్లవారుఝాము నుంచే ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. మొత్తం 2,88,338 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ల పంపిణీ చేయాల్సి ఉండగా.. తొలి రోజే 2,31,430 మందికి (80.26 శాతం) పింఛన్ పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గత నెల నుంచి కొత్తగా 7,312 మంది పింఛన్ అందుకోవడానికి అర్హులుగా తేల్చారు. వీరికి కూడా పింఛన్ అందిస్తున్నారు.

అంబులెన్స్ బోల్తా.. మహిళ దుర్మరణం

- తల్లి మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్తుండగా ఘటన..



ఘటనా స్థలం నుంచి అంబులెన్స్‌ను పక్కకు తీస్తున్న జేసీబీ

రాప్తాడురూరల్: అంబులెన్స్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందింది. తల్లి మృతదేహాన్ని స్వస్థలానికి అంబులెన్స్‌లో తీసుకొస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలో జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన చంద్రకళ, సావిత్రిబాయి తల్లీకూతుళ్లు. శనివారం రాత్రి బెంగళూరు ఆస్పత్రిలో చంద్రకళ మృతి చెందడంతో కూతరు సావిత్రిబాయి మరో ఆరుగురు బంధువులతో కలిసి స్వస్థలం బీదర్‌కు అంబులెన్స్ వాహనంలో మృతదేహాన్ని తీసుకెళ్తున్నారు. సోములదొడ్డి సమీపంలోకి రాగానే ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో అంబులెన్స్ డ్రైవరు నిద్ర మత్తులో డివైడర్‌ను ఢీకొట్టాడు. అదుపుతప్పిన వాహనం పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో సావిత్రిబాయి (36) ఎగిరి రోడ్డుమీద పడింది. తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయింది. మరో ముగ్గురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. బాధితులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అంగన్‌వాడీ.. ఆధునిక బడి

రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తోంది. ఆహ్లాదకర వాతావరణంలో ఆటపాటలతో కూడిన విద్యనందించేలా చూస్తోంది. నాడు – నేడు కార్యక్రమాన్ని అనుసంధానం చేస్తూ అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, నూతన భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టింది.

- 'నాడు–నేడు'తో కేంద్రాలకు మహర్దశ
- జిల్లాలో 91 చోట్ల భవన నిర్మాణాలు
- ప్రైవేటుకు దీటుగా ప్రీస్కూల్ నిర్వహణ



బెణికల్లులో సుందరంగా రూపుదిద్దుకున్న అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి ప్లాంట్

రాయదుర్గం: మహిళలు, చిన్నారులకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలికసదుపాయాలు మెరుగుపరిచేందుకు జగన్ సర్కారు చర్యలు చేపట్టింది. జిల్లాలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు 16,756, బాలింతలు 14,178 మంది, 3– 6 ఏళ్ల లోపు పిల్లలు 1,03,152 మంది ఉన్నారు. వీరికి పౌష్టికాహారంతో పాటు పూర్వ ప్రాథమిక విద్య అందేలా చర్యలు చేపట్టారు. ఇన్నాళ్లు కనీస మరమ్మతులకు నోచుకోని కేంద్రాలకు మహర్దశ కలిగేలా చర్యలు చేపట్టారు. జిల్లాలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 1,043 కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నాయి. 948 అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. ఉచిత భవనాల్లో 311 కేంద్రాలు ఉన్నట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. 'నాడు–నేడు' కార్యక్రమం కింద మొదటి దశలో జిల్లాలో 91 అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవన నిర్మాణాలు చేపట్టారు. వీటిలో ఇప్పటికే 22 పూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాలు సాగుతున్నాయి. ఒక్కో భవనానికి రూ.13.50 లక్షలు వెచ్చిస్తున్నారు. రూ.10 లక్షలు భవన నిర్మాణానికి, రూ.2.80 లక్షలతో విద్యుత్, నీటి సౌకర్యం, ఫర్నీచర్, రూ.30 వేలతో టాయిలెట్లు, ఇంటర్నల్ వర్కులు చేస్తున్నారు. భవనాల అప్‌గ్రేడేషన్, ఆధునికీకరణకు గాను ఒక్కో కేంద్రానికి రూ.5.50 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు.

పనుల్లో పారదర్శకత

భవన నిర్మాణ పనుల్లో పారదర్శకతకు పెద్దపీట వేశారు. పర్యవేక్షణ మొదలు నిధుల వినియోగం వరకు కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సభ్యులుగా అంగన్‌వాడీ టీచర్, గ్రామ/ వార్డు మహిళా పోలీసు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో పాటు చిన్నారుల తల్లులు ముగ్గురు ఉంటారు. కమిటీ పేరున బ్యాంకు ఖాతా తెరిచి, ఇద్దరికి చెక్ పవర్ ఇస్తారు. వీరి ద్వారా అవసరమైన నిధులు డ్రా చేస్తారు.

ప్రైవేటుకు దీటుగా ప్రీస్కూల్..

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమూల మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బాల్య దశలోనే విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో బోధనకు చర్యలు చేపట్టింది. ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషనల్ (ఈసీసీఈ) పథకం కింద మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు సమగ్ర వికాసమే ధ్యేయంగా పలు కార్యక్రమాలను రూపొందించింది. బాలల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా ఇప్పటికే పీపీ–1, పీపీ–2 పుస్తకాల ద్వారా ఆంగ్ల పదాల బోధన సాగుతోంది. ఆటపాటలతో చదువులు సాగేలా చర్యలు చేపట్టారు.

శుద్ధిజలం.. ఆరోగ్యానికి బలం..

తల్లులు, చిన్నారుల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేశారు. 15 లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధ ప్లాంట్లను కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 288 ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేశారు. శుద్ధిజల ప్లాంట్ల ఏర్పాటుతో నాణ్యమైన తాగునీరందిస్తున్నారు.

కేంద్రాల్లో నూతన సంస్కరణలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. పోషకాహారం మొదలు ఆంగ్ల మాధ్యమం అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. 'నాడు–నేడు' ద్వారా అంగన్‌వాడీ భవనాల మరమ్మతులు, పక్కా భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. – ప్రభావతి, సీడీపీఓ, రాయదుర్గం

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా నాణ్యమైన సరుకులు అందిస్తున్నారు. పౌష్టికాహారం ద్వారా రక్తహీనత నుంచి బయటపడుతున్నాం. ప్రైవేట్ కాన్వెంట్ల తరహా విద్యాబోధన సాగుతోంది. శుచి, శుభ్రతతో పాటు మినరల్ నీరందిస్తున్నారు. సంతోషంగా ఉంది. – ప్రణీత, గర్భిణి, భూపసముద్రం

పారదర్శకంగా సేవలు



అంగన్‌వాడీ కేంద్రంలో సౌకర్యాలు మెరుగయ్యాయి. పారదర్శకంగా సేవలందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫేస్ యాప్ ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందిస్తున్నాం. ప్రైవేట్ స్కూళ్ల తరహాలో ఆంగ్లమాధ్యమంలో బోధన చేస్తున్నాం. – గీత, అంగన్‌వాడీ కార్యకర్త, రేకులకుంట

రబీ సీజన్ ఆరంభం

- 72 వేల హెక్టార్లలో పప్పుశనగ సాగు అంచనా



పప్పుశనగ సాగుకు సిద్ధమైన నల్లరేగడి భూములు

అనంతపురం అగ్రికల్చర్: రబీ వ్యవసాయ సీజన్ మొదలైంది. ప్రధానపంట పప్పుశనగ సాగుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో విత్తన పంపిణీ ప్రక్రియ ప్రారంభించింది. నల్లరేగడి భూములు కలిగిన 21 మండలాల్లో ఈసారి 72 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పప్పుశనగ సాగులోకి రానుందని అధికారికంగా అంచనా వేశారు. ఇటీవల వర్షాలు పడటంతో ముందస్తుగా పంట సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. సాధారణంగా అయితే అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు పప్పుశనగ సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు ప్రకటించారు. అన్నీ సిద్ధం చేసుకున్న రైతులు ముందస్తు సాగుకు రెడీగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ రబీలో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో సాధారణ వర్షపాతం 139.3 మి.మీ నమోదు కావాల్సి ఉంటుంది. గతేడాది రబీలో సాధారణం కన్నా 42 శాతం అధికంగా 198.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఖరీఫ్‌లో 22 శాతం లోటు..

గత నాలుగేళ్లుగా కరువుతీరేలా కుండపోత వర్షాలు కురిపించిన వరుణుడు ఈసారి కాస్త నెమ్మదించాడు. అయినా క్రమం తప్పకుండా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడుతుండటంతో ఖరీఫ్ పంటలకు ఊరట కలిగిస్తున్నాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో గత జూన్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు ఈ నాలుగు నెలల కాలంలో సాధారణ వర్షపాతం 319.6 మి.మీకు గానూ 22.6 శాతం తక్కువగా 247.4 మి.మీ నమోదైంది.

వర్షసూచన..

గత వారం రోజులుగా జిల్లాలో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కొనసాగుతుండటంతో రబీ ఆశాజనకంగా మొదలైందని చెబుతున్నారు. తొలిరోజు ఆదివారం కూడా ఐదారు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఉపరితల ఆవర్తన ప్రభావం ఉన్నందున రాగల రెండు రోజులు కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

దుబాయ్ కరెన్సీ పేరుతో బురిడీ

- ముస్లిం దంపతులకు రూ.8 లక్షలకు కుచ్చుటోపీ



బాధితులు మజాహర్ అహ్మద్, ఫరీదా దంపతులు





మోసగాడు సలీం, సలీం వెంట వచ్చిన ఓ మహిళ

బత్తలపల్లి: దుబాయ్ కరెన్సీ పేరుతో ముస్లిం దంపతులను బురిడీ కొట్టించాడో ఘనుడు. రూ. 8 లక్షలకు కుచ్చుటోపీ పెట్టాడు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం పాతూరులోని తాడిపత్రి బస్టాండ్ వద్ద మజాహర్ అహ్మద్ చెప్పుల దుకాణంతో పాటు కూల్ డ్రింక్ షాపు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం సలీం అనే వ్యక్తి షాపు వద్దకొచ్చి కూల్‌డ్రింక్ తాగాడు. తనది బిహార్ రాష్ట్రమని, పెయింటింగ్ పని చేసుకుంటూ జీవిస్తున్నానంటూ మాటలు కలిపాడు. తన వద్ద దుబాయ్ కరెన్సీ ఉందని, మీరు మంచివారుగా ఉన్నారు అందుకే రూ. 16 లక్షల విలువ చేసే కరెన్సీని రూ.8 లక్షలకే ఇస్తానని ఆశ చూపాడు. నోట్లు ఇవ్వండి పరీక్షించుకుంటానని మజాహర్ అహ్మద్ కోరగా, సలీం ఆయనకు ఓ నోటు ఇచ్చాడు. తెలిసిన వ్యక్తి బెంగళూరులో ఉండడంతో మజాహర్ అయనను సంప్రదించాడు. సదరు నోటు భారత కరెన్సీ ప్రకారం రూ.16 పలుకుతుందని ఆయన తెలిపాడు. దుబాయ్ కరెన్సీ ఎలా వచ్చిందని మజాహర్‌ను ప్రశ్నిస్తే.. తాము ముంబైలో ఓ ధనవంతురాలైన వృద్ధురాలి వద్ద పని చేస్తుండగా ఆమె చనిపోయిందని, ఆమె కుమారుడు వారి తల్లికి చేసిన సేవకు గుర్తుగా సదరు కరెన్సీ ఇచ్చినట్లు తెలిపాడు. ఈ క్రమంలోనే సలీంకు మజాహర్ ఫోన్ చేసి దుబాయ్ కరెన్సీ చూపాలని కోరాడు. బత్తలపల్లికి వస్తే చూపిస్తానని సలీం తెలపగా.. ఆయన చెప్పినట్టే మూడు రోజుల క్రితం బత్తలపల్లి వచ్చాడు. సలీం అతడిని స్థానికంగా జనసంచారం లేని ప్రదేశానికి తీసుకెళ్లి దుబాయ్ కరెన్సీ చూపాడు. వెంటనే ఎంతో సంతోషంతో అక్కడి నుంచి అనంతపురం చేరుకున్న మజాహర్.. తన వద్ద ఉన్న డబ్బుతో పాటు తెలిసిన వారి నుంచి కొంత అప్పు తీసుకుని మొత్తం రూ. 8 లక్షలు పోగు చేసుకున్నాడు. ఆదివారం తన భార్య ఫరీదాతో కలిసి ద్విచక్రవాహనంలో బత్తలపల్లికి వస్తున్నట్లు సలీంకు సమాచారమివ్వగా, ఎస్టీ కాలనీకి రావాలని అతను సూచించాడు. అప్పటికే ఓ మహిళతో కలిసి అక్కడున్న సలీం.. మజాహర్ దంపతులు రాగానే దుబాయ్ కరెన్సీ ఇందులో ఉందని చెప్పి ఓ మూట వారికి అందజేశాడు. కొద్ది దూరం నడుచుకుంటూ వెళ్లి ద్విచక్రవాహనంలో ఉడాయించాడు. వారు వెళ్లిన కొద్ది సేపటికి బ్యాగు తెరిచి చూస్తే అందులో పాత న్యూస్ పేపర్లు కనబడ్డాయి. దీంతో హతాశులైన దంపతులు లబోదిబోమంటూ బత్తలపల్లి పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. తాము ఎలా మోసపోయిందీ వివరించారు. మూట ఇస్తున్న సమయంలో అవతలివారికి తెలియకుండా చిత్రించిన వీడియో చూపించారు. అయితే, ఇదంతా జరిగింది అనంతపురంలో కనుక అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారు చెప్పారని, అనంతపురం వెళ్తే జరిగింది బత్తలపల్లిలో కాబట్టి అక్కడికే వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పినట్లు బాధితులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, సలీంకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి ముఠా కాపు కాసినట్లు తెలిసింది. దాదాపు ఏడు మంది మరో వ్యాన్‌లో పర్యవేక్షించినట్లు సమాచారం.

'ఆరోగ్య సురక్ష'లో భాగస్వాములు కండి



మాట్లాడుతున్న రీజనల్ కో ఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే అనంత, విశ్వ, పైలా, గిరిజమ్మ

- జేసీఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రీజనల్ కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలసి రీజనల్ కో ఆర్డినేటర్ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 రోజుల పాటు జరిగే 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చైతన్యపర్చాలన్నారు. ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లపై ఉందన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మరింత మెరుగ్గా పని చేయాలన్నారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. పైలా నరసింహయ్య మాట్లాడుతూ గృహసారథుల ఇన్సూరెన్స్ రిజిస్ట్రేషన్ వంద శాతం పూర్తి చేయాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ గోపినాథ్ యాదవ్, పార్టీ ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, చింతా సోమశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.

ఏఈఈల అసోసియేషన్ కమిటీ ఎంపిక

అనంతపురం సెంట్రల్: ఏపీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీని ఆదివారం నగరంలోని హెచ్చెల్సీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తరుణ్‌కుమార్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సుధాకర్, ఉపాధ్యక్షులుగా అల్తాఫ్, ఓబులరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జీవన్, ట్రెజరర్‌గా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని ఇరిగేషన్ ఉద్యోగులు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత





శ్రమదానంలో పాల్గొన్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి, సత్కారమందుకున్న పారిశుధ్య కార్మికులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాప్రతినిధుల పిలుపు

- అనంతపురం రూరల్‌లో శ్రమదానం
- పారిశుధ్య కార్మికులకు ఘన సత్కారం

అనంతపురం రూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కలెక్టర్ గౌతమి అన్నారు. ఆరోగ్యంగా జీవించాలంటే తప్పనిసరిగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆదివారం 'స్వచ్ఛతా హి సేవ'లో భాగంగా అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలో 'ఏక్ దిన్ ఏక్ గంట' పేరిట శ్రమదానం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరై శ్రమదానం చేశారు. అనంతరం జేఎన్‌టీయూ కళాశాల మైదానంలో పారిశుధ్య కార్మికులు, విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించినట్లు వివరించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం రావాలని ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్యం కోసం పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. కరోనా కష్టకాలంలో సైతం ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తించారని ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. అలాగే 'కాఫీ విత్ క్లాప్ మిత్ర'లో భాగంగా కార్మికులతో కలసి కాఫీ తాగారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఆర్డీఓ మధుసూదన్, సర్పంచ్ ఉదయ్ శంకర్, ఎంపీపీ వరలక్ష్మి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి



అనంతపురం క్రైం: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ సైబర్ మోసాలు అధికమవుతున్నాయన్నారు. ప్రజల అవగాహనా లోపాన్ని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో ఆర్థిక, సామాజిక నేరాలకు పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

సైబర్ మోసాలకు ఇలా చెక్ పెట్టండి..

'క్రెడిట్/డెబిట్ కార్డు, యూపీఐ, ఓటీపీ ఇతర బ్యాంకు వివరాలను ఎవరితోనూ షేర్ చేసుకోవద్దు. అపరిచిత వ్యక్తులు లోన్, ప్రైజ్ మనీ, లాటరీ, ఆఫర్ అంటూ ఫోన్, ఎస్ఎంఎస్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించినపుడు ఎలాంటి విషయాలనూ వాళ్లతో చెప్పకూడదు. అత్యాశకు పోయి విలువైన సమాచారాన్ని చెప్పి నేరగాళ్ల బారిన పడి మోసపోవద్దు. ఎవరైనా ఫోన్ చేసి ప్రభుత్వ లావాదేవీలు, కేవీఐసీ అప్‌డేట్, ఆధార్ వెరిఫికేషన్ అంటూ అకౌంటు వివరాలు అడిగినా, ఏదైనా అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేసుకోమని చెప్పినా అలాంటివి చేయవద్దు. బ్యాంకు అధికారులు అని ఓటీపీ చెప్పమని, లేదా ఏదైనా లింక్ పంపి అందులో ఉన్న అప్లికేషనును ఇన్‌స్టాల్ చేసుకోమని చెప్పినా.. అలాంటివి చేయరాదు. ఓటీపీ చెప్పకూడదు. నెట్ బ్యాంకింగ్, మొబైల్ ఫోన్, వ్యాలెట్ తదితరాల పాస్‌వర్డ్ మారుస్తూ ఉండాలి. సోషియల్ మీడియాలో వాట్సాప్, ఫేస్ బుక్ , ఇన్స్టాగ్రాం, టెలీగ్రాం, ట్విట్టర్ ఇతరత్రా అప్లికేషన్స్‌ను ఉపయోగించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మీ ఫొటోలను, ప్రత్యేకించి స్త్రీల ఫొటోలను, పిల్లలు ఫొటోలు వీలైనంత వరకు డీపీ, ప్రొఫైల్ ఫొటోగా పెట్టుకోకూడదు' అని ఎస్పీ సూచించారు. ఎవరైనా మోసపోయినట్లయితే 1930 నంబరుకు కానీ లేదా https://cybercrime.gov.inకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

పెద్దలను గౌరవించడం అందరి బాధ్యత

- వృద్ధులకు అన్ని విధాలా అండగా ప్రభుత్వం
- కలెక్టర్ గౌతమి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం రూరల్: పెద్దలను గౌరవించడం అందరి బాధ్యత అని కలెక్టర్ గౌతమి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అనంతపురంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై, మాట్లాడారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పెద్దలు ఉన్న కుటుంబంలో ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. పెద్దల సూచనలు సలహాలు తీసుకోవాల్సిన అవసరం నేటి యువత అలవర్చుకోవాలన్నారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సామాజిక పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా నిలుస్తుందన్నారు. అనంతరం వయో వృద్ధులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్, ఆర్డీఓ మధుసూదన్, విశ్రాంత న్యాయమూర్తి కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

గుట్కా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా బస్తాలు చూపుతున్న పోలీసులు

తాడిపత్రి అర్బన్: అక్రమంగా తరలిస్తున్న గుట్కా బస్తాలను తాడిపత్రి అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపిన మేరకు... శనివారం అర్ధరాత్రి స్థానిక అశోక్ పిల్లర్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో గుంతకల్లు నుంచి తాడిపత్రికి వస్తున్న ఏపీ 02 ఏకే 9853 మారుతీ ఏకో వాహనాన్ని ఆపి పరిశీలించారు. అందులో రూ. 50 వేలు విలువ చేసే గుట్కా బస్తాలను తరలిస్తున్నట్లుగా తెలుసుకుని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. గుట్కా తరలిస్తున్న యాదళం సతీష్‌ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.



పచ్చని పంట పొలాల పక్కనే కనిపిస్తున్న పామిడి గ్రామం



కనుచూపు మేర ఎటు చూసినా కనువిందు చేస్తున్న పచ్చదనం



పామిడి సమీపంలో పెన్నానది పక్కనే రైతు తిరుపాలు పొలంలో బోరు నుంచి సమృద్ధిగా వస్తున్న నీరు

● పెన్నమ్మ పరుగులు.. భూములు మాగాణులు

జిల్లాలోని పామిడి గ్రామ సమీపంలో పెన్నా నదిలో నీరు పారితే సూర్యుడు పడమట ఉదయించినంత అద్భుతంగా పెద్దలు చెబుతుంటారు. మూడు దశాబ్దాల క్రితం ఈ ప్రాంత వాసులు పెన్నా నదిలో నీరు ప్రవహించడం చూశారు. ఆ తర్వాత చూద్దామంటే నీటి చుక్క లేకుండా పోవడంతో పీనుగులను కాల్చే వల్లకాడుగా మారింది. దీంతో పీనుగుల పెన్నాగా పిలిచేవారు. మళ్లీ ఇన్నాళ్లకు పెన్న ప్రవహిస్తోంది. అలాఇలా కాదు.. ఏకంగా జీవనదిలా పాయలుగా మారి ప్రవహిస్తోంది. దీంతో పెన్నా పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. ఈ క్రమంలో ఇంత కాలం బీళ్లుగా పడి ఉన్న భూములు కాస్త మాగాణులయ్యాయి. బోడి కొండలు పచ్చదనం సంతరించుకున్నాయి. ఒకప్పుడు ఏడాదికి రెండు పంటలు తీయడం గగనమైన ప్రాంతంలో ఇప్పుడు ఏకంగా మూడో పంట తీసేందుకు రైతులు పోటీ పడ్డారు. దీంతో ఎటు చూసినా పచ్చని పంట పొలాలు కనువిందు చేస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



పచ్చదనం సంతరించుకున్న బోడి కొండలు

సీఆర్పీ పోస్టులకు ఫేక్ సర్టిఫికెట్లు?

- ఆన్‌లైన్‌లో ఇష్టానుసారంగా మార్కుల నమోదు
- ఐఈఆర్పీ సర్వీసు లేకపోయినా ఉన్నట్లుగా చూపిన ఘనులు
- ఆర్‌సీఐ గడువు ముగిసిన పత్రాలతోనూ దరఖాస్తు
- నకిలీవిగా తేలితే క్రిమినల్ కేసు నమోదుకు చర్యలు



అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష సహిత విద్య విభాగంలో ఖాళీగా ఉన్న ఐఈఆర్పీ పోస్టుల భర్తీల్లో కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. పరిశీలనలో తేలితే తప్పుకుందాం... లేదంటే ఉద్యోగం వస్తుందనే దురాలోచనతో ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రధానంగా స్పెషల్ బీఈడీ, డీఈడీ కోర్సులకు సంబంధించి నకిలీ సర్టిఫికెట్లను జత చేసినట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న సీఆర్పీ పోస్టుల భర్తీకి సంబంధించి గతంలో ఆన్‌లైన్ ద్వారా సమగ్ర శిక్ష ఉన్నత స్థాయి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా 42 పోస్టులను భర్తీ చేయనున్నారు. దరఖాస్తు ప్రక్రియలో కొందరు అక్రమార్కులు నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా మార్కులు నమోదు చేసి అప్‌లోడ్ చేశారు. స్పెషల్ ఎడ్యుకేషన్‌తో పాటు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) నుంచి సర్టిఫికెట్ లైవ్‌లో లేకున్నా పాతవాటితోనే దరఖాస్తు చేసినట్లుగా తెలుస్తోంది. మరోవైపు గతంలో ఐఈఆర్పీగా పని చేయని వారు సైతం ఈ కేటగిరి కింద దరఖాస్తు చేస్తూ సర్వీస్ పాయింట్లను నమోదు చేశారు. రేపటి (మంగళవారం) నుంచి రెండు రోజుల పాటు సమగ్రశిక్ష ఏపీసీ కార్యాలయంలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరగనుంది. ఈ నేపథ్యంలో కొందరు అభ్యర్థులు దరఖాస్తు సమయంలో చేసిన అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. పరిశీలన అధికారులు గుర్తిస్తే ఏదో ఒకటి చెబుదాం, దొరక్కపోతే అలాగే ముందుకు వెళ్దామనే ఆలోచనలో అభ్యర్థులు ఉన్నారు.

పరిశీలన పక్కాగా ఉంటుంది



సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిపుణుల సమక్షంలో పక్కాగా చేపడుతున్నాం. ఒకటికి రెండు సార్లు జాగ్రత్తగా పరిశీలిస్తారు. అనుమానం వస్తే సంబంధిత కళాశాలలు, యూనివర్సిటీలకు లేఖలు రాసి, వాస్తవాలు రాబట్టుకుంటాం. ఇందులో ఫేక్ సర్టిఫికెట్లు జత చేసినట్లు నిగ్గు తేలితే దరఖాస్తు దారుపై క్రిమినల్ కేసు బనాయిస్తాం.

– వి.నాగరాజు ఏపీసీ సమగ్రశిక్ష

సాఫ్ట్‌బాల్ సీనియర్ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

అనంతపురం: ఈ నెల 16, 17, 18 తేదీల్లో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరిగే సీనియర్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా పురుషుల, మహిళల జట్ల ఎంపిక ప్రక్రియ ఆదివారం ముగిసింది. అనంత క్రీడాగ్రామం వేదికగా సాగిన ఈ ప్రక్రియకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికలను ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు పర్యవేక్షించారు. మహిళల జట్టుకు టి.లక్ష్మి, బి.లావణ్య, వి.సాయిరిషిత, డి.హంసనయన, పి.స్రవంతి, టి.ధరణి, ఎస్.బ్యూలా, ఎం.కీర్తన, ఎం.దీక్షిత, జి.నాగప్రసన్నలక్ష్మి, వై.ఖ్యాతి కల్యాణి, డి.అమీదాబీ, బి.శిరీష, కె.కల్పన, బి.గౌరీప్రియ, ఎస్.మధులత, జి.కీర్తన ఎంపికయ్యారు. అలాగే పురుషుల జట్టులో బి.మహేష్, ఎం.శివకుమార్, ఈ.వరుణ్‌కుమార్, బి.పృథ్వీరాజ్, పి.అశోక్ కుమార్, కె.లోకేష్, బి.వినోద్, సి.లక్ష్మీనారాయణ, ఎస్.లక్ష్మీకళ్యాణ్, బి.షాకీర్, ఎల్.సింహాద్రి, ఎ.పవన్‌కుమార్, కె.సాయివెంకట్, జి.అరవిందరెడ్డి, ఎం.సి.రంజిత్‌కుమార్, ఎం.ధనుష్, బి.అక్షయ్‌సాగర్ చోటు దక్కించుకున్నారు. కార్యక్రమంలో నాగేంద్ర, రామకృష్ణ, ప్రభాకర్, గోపాలరెడ్డి, లతాదేవి, ఫక్కీరప్ప, రమేష్, చంద్ర, సాయి దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చేసిన తప్పిదాలకు శిక్ష తప్పదు

- బాబు అరెస్ట్‌పై టీడీపీ సానుభూతి రాజకీయం
- కుల విద్వేషాలు రెచ్చగొట్టి లబ్ధి పొందేందుకు కుట్ర
- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రి హోదాలో చేసిన తప్పిదాలకు శిక్ష అనుభవించక తప్పదని వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. ప్రజల సొమ్ము, ఆస్తులు దోచుకున్నారు కాబట్టే చంద్రబాబు నేడు జైల్లో ఉన్నారని, ఈ విషయంగా టీడీపీ నేతలు సానుభూతి రాజకీయాలకు తెరలేపడం సిగ్గుచేటన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబును సీఐడీ అధికారులు రిమాండ్‌కు తరలిస్తే టీడీపీ నాయకులు తప్ప ప్రజలెవ్వరూ బాధపడడం లేదన్నారు. ఆయనో పెద్ద అవినీతిపరుడనే వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు కుల విద్వేషాలు రెచ్చగొట్టి లబ్ధి పొందాలనుకుంటున్నారని మండి పడ్డారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ఏ ఒక్క రోజూ ప్రజల కోసం దీక్షలు చేపట్టని టీడీపీ శ్రేణులు నేడు ఓ దగాకోరు కోసం రోజుల తరబడి దీక్ష చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత బండారు సత్యనారాయణను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, ఉరవకొండ ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, కురుబ, కమ్మ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, తేజోనాథ్, వెంకటేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తిప్పయ్య, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, వెంకలరెడ్డి, సోమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

- పీఆర్ సీఈ బాలూనాయక్



ఊబిచెర్లలో సచివాలయ ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న బాలూనాయక్

గుత్తి రూరల్: గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను పంచాయతీ రాజ్ శాఖ చీఫ్ ఇంజినీర్ బాలూనాయక్ ఆదేశించారు. గుత్తి మండలం ఊబిచెర్లలో చేపట్టిన ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ నిర్మాణాలను ఆదివారం ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, ఈఈ చంద్రశేఖర్, ప్రాజెక్టు డీఈఈ ప్రసాద్, డీఈ మురళీధర్, క్వాలిటీ డీఈ భరత్ ప్రకాష్, ఏఈ మల్లేష్‌నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

'అనంత'లో నకిలీ వైద్యులు

- హెల్త్ క్యాంపుల పేరుతో పల్లె వాసులకు బురిడీ
- నగరంలోని పలు ప్రముఖ ఆస్పత్రుల్లో వైద్యులమంటూ టోకరా
- ప్రముఖ కార్డియో సెంటర్‌లో ఐదేళ్ల అనుభవమంటూ జీరాలు
- తాజాగా అనంతలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యానికి టోపీ
- బకాయి వేతనాలు చెల్లించాలంటూ ఎదురు దాడి



అనంతపురం క్రైం: గుండె వైద్య నిపుణులమంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే జంట ఒకటి అనంతలో పాగా వేసింది. పల్లె ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు పెట్టి లేని జబ్బు ఉన్నట్లుగా చూపి కాసులు పోగేసుకుంటున్న ఈ నకిలీ వైద్యుల బాగోతం ఇటీవల వెలుగు చూసింది. విజయవాడలోని ఓ ప్రముఖ కార్డియో సెంటర్‌లో ఐదేళ్ల పాటు పనిచేశామంటూ ఏకంగా అనంతపురంలోని ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులను సైతం నమ్మించి మోసాలకు తెగబడిన దంపతుల ఉదంతం చివరకు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, రాజీ వ్యవహారంతో గుట్టుచప్పుడు కాకుండా సద్దుమణిగింది.

వృత్తికి సంబంధంలేని చదువు..

బీకాం పూర్తి చేసిన ఓ యువకుడు, ఇంటర్ వరకూ చదువుకున్న యువతి దంపతులుగా మారి తాము వైద్యులమంటూ అనంతపురంలోని పలు ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇంతకాలం సేవలు అందిస్తూ వచ్చారు. కొద్ది రోజుల క్రితం కోర్టు రోడ్డులో మూతపడిన ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రిలోనూ వీరు పనిచేశారు. అయితే ఆలస్యంగా వీరు నకిలీలుగా గుర్తించిన ఆస్పత్రి యాజమాన్యం అక్కడి నుంచి వీరిని తరిమేసింది. దీంతో ఆదిమూర్తినగర్‌లోని మరో ప్రముఖ ఆస్పత్రి నిర్వాహకుడిని కలసి తాము విజయవాడలోని ఓ ప్రముఖ కార్డియో సెంటర్‌లో ఐదేళ్లపాటు పనిచేశామని, అక్కడ వేతన విషయంలో గొడవలు తలెత్తడంతో అనంతపురానికి వచ్చినట్లు వివరించి, తమకు అవకాశం కల్పిస్తే ఆస్పత్రి కీర్తిప్రతిష్టలను మరింత పెంచుతామని భరోసానిచ్చారు. వారి మాటలు నమ్మి కలిసి పనిచేసేందుకు ఆస్పత్రి నిర్వాహకులు అంగీకరించారు.

నెలకు రూ.1.50లక్షల వేతనంతో...

కార్డియాలజిస్ట్‌గా తాను పనిచేయాలంటే నెలకు రూ.1.50 లక్షల వేతనంతో పాటు వైద్య శిబిరాలకు వెళ్లేందుకు కారు, ఇతర ఖర్చులు భరించాలని ఆ యువకుడు కండీషన్ పెట్టాడు. తన భార్య ఫార్మా-డీ (డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) చేసిందని, ఆమె కూడా తనతో పాటు క్యాంప్‌లకు వస్తుందని, ఇందుకు గాను ఆమెకు రోజుకు రూ.వెయ్యి చొప్పున ఇవ్వాల్సి ఉంటుందని ఒప్పందం చేసుకుని, మొత్తం రూ.3.50 లక్షలను ఈ ఏడాది మార్చిలో అడ్వాన్స్‌గా తీసుకుని విధుల్లోకి చేరారు.

జబ్బు లేకున్నా ఉందంటూ..

తాము పనిచేస్తున్న ఆస్పత్రి తరఫున ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటి వరకూ మొత్తం 11 వైద్య శిబిరాలను నకిలీ వైద్య దంపతులు నిర్వహించారు. వజ్రకరూరు మండలం తట్రకల్లు, బత్తలపల్లి మండలం నిడిగల్లు, దాడితోట తదితర గ్రామాల్లో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 8 మందికి గుండె సంబంధిత జబ్బులున్నాయని, అనంతపురంలో తాము పనిచేస్తున్న ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలంటూ సిఫారసు చేశారు. దీంతో బెంబేలెత్తిన సదరు గ్రామీణులు తమకు తెలిసిన వైద్యుడిని సంప్రదిస్తే అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించిన అనంతరం వారికి ఎలాంటి జబ్బులూ లేవని నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న సదరు బాధితులు నేరుగా అనంతపురంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి చేరుకుని నిర్వాహకులను నిలదీశారు. దీంతో అవాక్కయిన ఆస్పత్రి నిర్వాహకులు నకిలీ వైద్య దంపతులను ప్రశ్నించడంతో సమాధానం ఇవ్వకుండా దాటవేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో వారి సర్టిఫికెట్లు చూపాలని నిర్వాహకులు డిమాండ్ చేయడంతో తమకు అవమానం జరిగిన చోట ఒక క్షణం కూడా ఉండమంటూ దంపతులు వెళ్లిపోయారు. అనంతరం బకాయి వేతనం చెల్లించాలంటూ వేధింపులకు తెరలేపారు. వేధింపులు తాళలేక చివరకు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీకి నేరుగా ఆస్పత్రి నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన ఓ సీఐ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చి వదిలేసినట్లు తెలిసింది.

ఈ-క్రాప్ నమోదుతోనే పరిహారం : డీఏఓ



ఈ-కేవైసీ నమోదుపై ఆరా తీస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

రాప్తాడు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని, లేకుండా పంట నష్టపోయినప్పుడు పరిహారం అందకుండా పోయే ప్రమాదముందని రైతులను జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమామహేశరమ్మ హెచ్చరించారు. ఆదివారం రాప్తాడులోని రైతు భరోసా కేంద్రంలో ఈ-కేవైసీ నమోదుకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించి, మాట్లాడారు. పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 97 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 8,55,035 ఎకరాల్లో ఉద్యాన పంటలతో పాటు ఇతర పంటలూ సాగులో ఉన్నాయన్నారు. ఇందులో 8,29,441 ఎకరాల్లో ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయిందన్నారు. 2,30, 252 మంది రైతులు పంటలు సాగు చేయగా, వీరిలో 37 శాతం మంది మాత్రమే ఈ-కేవైసీ పూర్తి చేయించారన్నారు. ఈ నెల 5వ తేదీ లోపు ఈ-కేవైసీ పూర్తి చేయించాలని సూచించారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేయని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేలా 80 శాతం సబ్సిడీతో ఉలవలు, పెసలు, జొన్నలు, అలసందల విత్తనాలు అందజేస్తున్నట్లు వివరించారు.

ఎ.కొండాపురంలో వ్యక్తి మృతి

పుట్లూరు: ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని అంబేడ్కర్ కాలనీ నివాసి నాగరంగయ్య(42) పుట్లూరు మండలం సూరేపల్లిలో వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో సూరేపల్లికి వచ్చిన ఆయన ఆదివారం తిరుగు ప్రయాణమై ఎ.కొండాపురానికి చేరుకున్నాడు. అక్కడ మూర్ఛ రావడంతో కిందపడి గిలగిలా కొట్టుకుంటూ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వాహనం ఢీ కొని మహిళ మృతి

పెద్దవడుగూరు: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం దైవాలమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత తిరుమలరెడ్డి, డీలర్ సుమలత (48) దంపతులు. ఆదివారం ఉదయం అనంతపురంలోని ఓ కళాశాలలో చదువుకుంటున్న కుమారుడిని పలకరించి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల సమీపంలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమలత అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన తిరుమలరెడ్డిని పామిడిలోని సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

● మహాత్ముని స్ఫూర్తి



గాంధీజీ వేషధారణలో తిరుపతయ్య

అనంతపురం కల్చరల్: మహాత్ముడి వేషధారణలో కనిపిస్తున్న ఈయన పేరు తిరుపతయ్య. పుట్టి పెరిగింది ప్రకాశం జిల్లా అయినా బీఎస్‌ఎన్‌ఎల్‌లో ఉద్యోగ అవకాశం దక్కడంతో 1987లో అనంత జిల్లాకు వచ్చి గార్లదిన్నెలో స్థిర నివాసమేర్పరుచుకున్నారు. ఆధునిక పోకడలు, యాంత్రిక జీవనంలో దేశభక్తులను నేటి తరం మరుస్తోందని గుర్తించిన ఆయన అంతరించి పోతున్న విలువలకు గాంధీజీ వేషధారణలో పునర్జీవం పోసే చర్యలు చేపట్టారు. 2021 నుంచి ఆయన ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ గాంధీజీ వేషధారణలో ఆకట్టుకున్నారు. పాత తరం వారి ఆదర్శ భావాలు నేటి తరానికి పరిచయం చేయకపోతే రానున్న కాలంలో మానవత్వం నశించి పోయే ప్రమాదముందని చెబుతుండే ఆయన.. గాంధీజీ వేషమే కాకుండా వాల్మీకి, అల్లూరి సీతారామరాజు వేషధారణలతోనూ కనిపిస్తుంటారు.

క్లుప్తంగా

పోలీసుల గ్రామసభ

ఆత్మకూరు: మండలంలోని తలుపూరు గ్రామంలో ఎస్‌ఐ జనార్దన్, పోలీసు సిబ్బంది ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం కొనసాగించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదా 100 కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉదయాన్నే పింఛన్ పంపిణీ



ఆత్మకూరులో పింఛన్ అందిస్తున్న గ్రామ వలంటీర్

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఆదివారం తెల్లవారు జామున వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. ఆదివారం ఒకటోతేదీ కావడంతో ఉదయాన్నే తలుపు తట్టి పింఛన్ అందించారు.

జగనన్నకు రుణపడి ఉంటాం

ఆత్మకూరు: సీఎం జగనన్నకు రుణపడి ఉంటామని పింఛన్ తీసుకున్న లబ్ధిదారులు తెలియజేశారు. ఆదివారం మండలంలోని తలుపూరు గ్రామంలో పాత పింఛన్లతోపాటు కొత్తగా మంజూరయిన పింఛన్లను అందించారు. తలుపూరుకు చెందిన శ్రీనివాసులు రెండు కిడ్నీలు పాడై మంచానికే పరిమితమయ్యాడు. వలంటీర్, సచివాలయ సిబ్బంది శ్రీనివాసులుకు పింఛన్ మంజూరు చేయించారు. డీఎంహెచ్‌ఓ (డయాలసీస్) పింఛన్ రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేష్, పంచాయతీ సెక్రటరీ మహబూబ్‌జాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా, భాను, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీటీ క్రీడా మైదానంలో ఏపీఎల్ లీగ్ అండర్-15 లో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. గూలి కొండారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో ఆత్మకూరు ఎప్పుడు ముందంజలో ఉంటుందన్నారు. అనంతరం ఆత్మకూరు, ఎస్ఎస్‌బీఎన్ జట్లకు పోటీ నిర్వహించగా, ఎస్ఎస్‌బీఎన్ జట్టుపై ఆత్మకూరు జట్టు విజయం సాధించింది. వీరు అనంతపురం జిల్లా ఏపీఎల్ లీగ్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని క్రికెట్ కోచ్ షఫీ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడి మృతి



కోనయ్య భౌతిక కాయానికి నివాళి అర్పిస్తున్న తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరు పంచాయతీ పరిధిలోని కృష్ణంరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కురుబ పెద్ద కోనయ్య (76) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందారు. వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఉదయం గ్రామానికి వెళ్లి కోనయ్య భౌతికకాయానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొండారెడ్డి, సునీల్‌దత్తరెడ్డి, సర్పంచులు ఇటుకలపల్లి భాస్కర్‌రెడ్డి, ఆకుతోటపల్లి గురుప్రసాద్, ఉపసర్పంచ్ కేపీ ఓబిలేసు, మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, నాయకులు లింగమయ్య, జయచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

రూరల్ మండల కన్వీనర్‌కు సన్మానం



రాధమ్మను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రాప్తాడురూరల్: వైఎస్సార్‌సీపీ అనంతపురం రూరల్ మండలం కన్వీనర్‌గా నియామకమైన కదిరప్ప రాధమ్మ యాదవ్‌ను సన్మానించారు. రాచానపల్లి, సిండికేట్‌నగర్, కక్కలపల్లి కాలనీ పంచాయతీ సీఏఎస్ పురం, జాకీర్ కొట్టాలు, ఆదర్శనగర్, దండోరా కాలనీ, నందమూరి నగర్, పిల్లిగుండ్ల కాలనీ తదితర ప్రాంతాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, వార్డుమెంబర్లు, నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సన్మానించారు. రాధమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సూచనల మేరకు ప్రతి గ్రామంలోనూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

నగర పరిశుభ్రతకు పాటుపడదాం

– ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



పాతూరులో గాంధీ విగ్రహం వద్ద రోడ్లను ఊడుస్తున్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు

అనంతపురం కార్పొరేషన్: గాంధీ స్ఫూర్తితో నగర పరిశుభ్రతకు పాటుపడదామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏక్ తారీఖ్..ఏక్ గంట కార్యక్రమం కింద శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాతూరు గాంధీ బజార్ సర్కిల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మి తదితరులు చీపురుపట్టి రోడ్లను ఊడ్చారు. మొదటగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పరిశుభ్రతకు పాటుపడుదామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. డివైడర్ల మధ్య ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, మొక్కలు నాటి నీరు పోశారు. మేయర్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, దేవి, లక్ష్మి, సుమతి పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత అవసరం

అనంతపురం కార్పొరేషన్: విద్యతో పాటు సామాజిక బాధ్యత అవసరమని ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్ఏ కోరి పేర్కొన్నారు. ఆదివారం 59వ సచివాలయ పరిధిలోని బళ్లారి బైపాస్ రోడ్డులో స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏక్ తారీఖ్ ఏక్ గంట కార్యక్రమాన్ని నిర్వహించి, రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, డీన్ ఇన్‌చార్జ్ జీ రామ్ రెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య ఎస్. హనుమాన్ కెనడీ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అనంతపురం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య అరుణ కాంతి పేర్కొన్నారు. ఆదివారం ఏక్ తారీక్ ఏక్ గంట కార్యక్రమం నిర్వహించారు. రిజిస్ట్రార్, వైస్ ప్రిన్సిపాల్ విద్యార్థులతో 'స్వచ్ఛతా హీ సేవా' ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ డి. విష్ణువర్ధన్, డాక్టర్ జి.మమత, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ టి.నారాయణ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శారద, ఆచార్య ఏపీ శివకుమార్, కె. మాధవి, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు ఆచార్య ఎస్. చంద్ర మోహన్ రెడ్డి , ఆచార్య ఆర్.భువన విజయ, డాక్టర్ యం.రామశేఖర రెడ్డి, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ బి.దిలీప్ కుమార్ , బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏక్ దిన్ ఏ గంట కింద ఉద్యోగులు శ్రమదానం చేశారు. డీఆర్‌ఓ గాయత్రిదేవి పర్యవేక్షణలో రెవెన్యూ, సర్వే శాఖ ఉద్యోగులు కార్యాలయ ఆవరణలో చెత్తను, పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి శ్రీధర్, విభాగాల సూపరింటెండెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతపురం : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ ఎం ఉమ అధ్యక్షతన 'ఏక్ తారీఖ్ ఏక్ గంట' కార్యక్రమం కింద శ్రమదానం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు, కార్యదర్శి రమ, ఉప గ్రంథాలయ అధికారి వి. సుబ్బరత్నమ్మ, సిబ్బంది, పాఠకులు కలిసి గ్రంథాలయ ఆవరణాన్ని శుభ్రం చేశారు.

అనంతపురం కల్చరల్: మహాత్మాగాంధీ ఆశయ సాధనే లక్ష్యమని నెహ్రూ యువకేంద్ర సభ్యులు అన్నారు. ఎస్‌వైకే ఆధ్వర్యంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆదివారం శ్రమదానం చేశారు. టవర్‌క్లాక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం, పరిసర ప్రాంతాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సభ్యులు నందిత, శివ, గణేష్,కీర్తి, పవన్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: గ్రామాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉమా మహేశ్వరమ్మ, ఎంపీడీఓ సాల్మన్, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడదాం

ఆత్మకూరు: మండలంలోని ప్రతి గ్రామాన్నీ పరిశుభ్రంగా ఉంచుదాం.. గ్రామాల అభివృకి పాటుపడదామని ఎంపీపీ హేమలత తెలిపారు. ఆదివారం మండల వ్యాప్తంగా స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షరిమ్మల, ప్రజాప్రతినిధులు, అధికారులు చీపుర్లు పట్టి చెత్త తొలగించారు. బి.యాలేరులో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, పంచాయతీ సెక్రటరీ శిరీష, గ్రామ సచివాలయ కన్వీనర్లు ఓటీ టైలర్ వెంకటేష, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి, నాగరాజు, ఆంజనేయులు , శీన, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



శ్రమదానంలో పాల్గొన్న సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులు



గ్రంథాలయంలో శ్రమదానం చేస్తున్న దృశ్యం



పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్



ఆత్మకూరులో చెత్తను ఊడుస్తున్న అధికారులు , ప్రజా ప్రతినిధులు



కలెక్టరేట్ ఆవరణలో శ్రమదానాన్ని పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఓ గాయత్రిదేవి



రాప్తాడు: శ్రమదానం చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు



గాంధీ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న యువతీయువకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

• రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ చాటిన చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం: రోలర్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు.నగరంలో జిల్లా రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో భాగంగా ఆదివారం 35వ అంతర్ జిల్లా చాంపియన్‌షిప్ సెలక్షన్ ట్రైల్స్-23 జరిగాయి. దాదాపు 30 మంది క్రీడాకారులు జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో పాల్గొని, ప్రతిభ చాటిన మొదటి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆకాంక్షించారు. అనంతపురం రూరల్ మండలం పరిధిలోని జగనన్న కాలనీల్లో అందుబాటులో ఉన్న సిమెంట్ ఫ్లాట్ ఫారాలను రోలర్ స్కేటింగ్ పోటీలకు ఉపయోగించుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

సందడిగా అనంత క్రీడాగ్రామం



నేషనల్ ఫుట్‌బాల్ బాలికల చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలతో అనంత క్రీడాగ్రామంలో సందడి నెలకొంది. ఆదివారం ఛత్తీస్‌ఘడ్, జమ్మూకాశ్మీర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక్క గోల్ తేడాతో జమ్మూకాశ్మీర్ విజయం సాధించింది. అలాగే లఢక్‌పై తలపడిన మధ్యప్రదేశ్ జట్టు ఏకపక్షంగా 17 గోల్స్ సాధించి ఘన విజయం నమోదు చేసింది. తెలంగాణ, డామన్‌డయ్యూ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 12-0 గోల్స్ తేడాతో తెలంగాణ జట్టు విజయం సాధించింది. పాండిచ్చేరిపై జరిగిన మ్యాచ్‌లో 9-2 గోల్స్ తేడాతో చండీఘడ్ జట్టు విజయం సాధించింది.

జాతీయ స్థాయి బాలిక ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఈ నెల 5 నుంచి రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌లో ప్రారంభమయ్యే జాతీయ స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే రాష్ట్ర జట్టును అనంత క్రీడాగ్రామం వేదికగా ఆదివారం ఎంపిక చేశారు. మొత్తం 22 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్ తెలిపారు.

జోనల్ గ్రిగ్స్ లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న డీఈఓ నాగరాజు

అనంతపురం: అనంతపురం జిల్లా జోనల్ గ్రిగ్స్ పోటీల లోగోను డీఈఓ నాగరాజు ఆవిష్కరించినట్లు సెక్రటరీ సంజీవరాయుడు ఆదివారం తెలిపారు. ఈ జోనల్ గ్రిగ్స్ నవంబర్ చివరి వారం నుంచి డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్దేశించారు. కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ సెక్రటరి సుగుణమ్మ, స్కూల్ గేమ్స్ జిల్లా కో ఆర్డినేటర్ నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు అక్కులప్ప, శ్రీనివాసులు, నరసింహారెడ్డి, నాగరాజు, ఆంజనేయులు, నందకుమార్, సునీత, ఓబులేసు, వేణు, కోటప్ప, శకుంతల పాల్గొన్నారు.

కార్తికేయుడికి విశేష పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, విశేష పూజలు చేశారు. స్వామి బంగారు కవచాన్ని మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి తిమ్మన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీపీఎస్ - జీపీఎస్‌పై ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జి.సూర్యుడు అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సూరీడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్స్ రామాంజనేయులు, శ్రీనివాసులు, ఫణి భూషణ్, కిష్టప్ప, కిరణ్ రమేష్‌రెడ్డి, సురేష్, సుధాకర్, బాబ్జీనాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

మట్కాపై ఉక్కుపాదం

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంతో పాటు రాప్తాడు ప్రాంతాల్లో చాలా కాలంగా మట్కా నిర్వహిస్తున్న కీలక వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. జిల్లాలో మట్కా కట్టడి అయ్యేదాకా దాడులు కొనసాగుతుంటాయని, పోలీసులు ఆదిశగా పని చేయాలని ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలు జారీ చేశారు. వన్‌టౌన్ పోలీసులు ఇప్పటికే ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.70 వేలకు పైగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. రాప్తాడు పోలీసులు బెంగళూరులోని మట్కా కంపెనీతో సంబంధాలు కొనసాగిస్తున్న వెంకటేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

ఆదియోధుడు నవల ఆవిష్కరణ



నవలను ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవులు, రచయితలు

అనంతపురం కల్చరల్: స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ వీఆర్ రాసాని రచించిన 'ఆది యోధుడు' నవల ఆవిష్కరణ, పుస్తక పరిచయ సభ ఆదివారం జరిగింది. ప్రముఖ కవి చం.శాస్త్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, కవి తూముచెర్ల రాజారాం, విమర్శకుడు డాక్టర్ నాగేశ్వరాచారి, నర్సిరెడ్డి తదితరులు మాట్లాడారు. సీమ సాహిత్యానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన రచయిత రాసాని రచనలు ఆలోచనాత్మకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ రచయితలు రాధేయ, తరిమెల అమరనాథరెడ్డి, నానీల నాగేంద్ర, రియాజ్, షరీఫ్, పూజారి ఈరన్న, జిరసం అధ్యక్ష కార్యదర్శులు జెన్నే ఆనంద్, కొత్తపల్లి సురేష్, చిలుకూరు దీవెన, హరినాథరెడ్డి, నబీరసూల్, చిలుకూరి దీవెన, చెట్ల ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్ర స్ఫూర్తి కొనసాగాలి



పొట్టి శ్రీరాముల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వేమన ఫౌండేషన్ సభ్యులు

అనంతపురం కల్చరల్: నాటి ఆంధ్రరాష్ట్ర స్ఫూర్తి కొనసాగాలని విశ్రాంత వీసీ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సాయిబాబా కళాశాలలోని వేమన ఫౌండేషన్ కార్యాలయంలో వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. ఆచార్య రామకృష్ణారెడ్డి, ఎస్ఎస్‌బీఎన్ కాలేజ్ కరస్పాండెంట్ పీఎల్ ఎన్‌రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి మాట్లాడారు. అంతకుముందు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. కవులు, రచయితలు మధురశ్రీ, రియాజుద్దీన్, కృష్ణవేణి, జలీల్, రవీంద్రరాజు, రాయలసీమ సమితి రాజశేఖరరెడ్డి, నాగేషారెడ్డి, లోకన్న తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ లాన్ టెన్నిస్‌లో ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపికను నారాయణ టెన్నిస్ అకాడమీలో ఆదివారం నిర్వహించారు. ఇందులో అండర్ -14లో పఠాన్ జీశాన్, జి. హరీష్, కార్తిక్ గౌడ్, సుకృత్, బాలికల విభాగంలో జోషి ప్రియ రెడ్డి, సి. ప్రణీతి, ఎస్.ప్రియ, పి.జ్ఞానేశ్వరి, ఎస్. జారా ఎంపికయ్యారు.

రేపు స్పాట్ అడ్మిషన్లు

తాడిపత్రి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపడతామని పేర్కొన్నారు. పాలిసెట్ రాయకున్నా టెన్త్ పాసైన వారు సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. సెల్: 9493773778లో సంప్రదించాలని సూచించారు.

కేసు నమోదు

నార్పల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులపై సోషల్‌మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ, నారాయణస్వామి సీఎం కుటుంబ సభ్యులతోపాటు మంత్రి రోజాను దూషిస్తూ పోస్టులు పెట్టారన్నారు.

ప్రతి ఇంటా ధర్మం ఆచరింపబడాలి



మాట్లాడుతున్న విరజానంద స్వామీజీ

అనంతపురం కల్చరల్: ప్రతి ఇంటా ధర్మం ఆచరింపబడేలా అందరూ కృషి చేయాలని బ్రహ్మంగారి మఠం పీఠాధిపతులు విరజానంద స్వామీజీ ఉద్బోధించారు. ఆదివారం స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో రాయలసీమ స్థాయి సమతా సమ్మేళనం జరిగింది. స్వామీజీ మాట్లాడుతూ వీరబ్రహ్మం గారి మఠం కుల మతాలకతీతంగా భారతీయ విలువలను ప్రచారం చేసే దిశగా సాగుతోందన్నారు. ఆరెస్సెస్ ప్రాంత సహకార్యవాహ యుగంధర్ మాట్లాడుతూ సాటి మనిషిలో భగవంతుడి దర్శించడమే భారతీయుల ఔన్నత్యమన్నారు. ఆరెస్సెస్ జిల్లా సంఘ చాలక్ హిమకర్ అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో సమరసతా వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామప్రసాద్, సంస్థ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మథరావు తదితరులు మాట్లాడారు. సమరసతా రాష్ట్ర కార్యదర్శి నరసింగనాయుడు,మహిళా ప్రముఖ్ జయప్రద, ఆరెస్సెస్ ప్రతినిధులు ధర్మప్రచారక్ సాయిరాం, ఈశ్వరరెడ్డి, ఆలూరు రాఘవేంద్ర, రేనాటి నాగేశ్వరరెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కే ప్రధాన ఆయుధం



రాప్తాడులో వృద్ధులను సన్మానిస్తున్న తహసీల్దార్ లక్ష్మీ నరసింహ

రాప్తాడు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రధాన ఆయుధమని తహసీల్దార్ లక్ష్మీ నరసింహ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. 80 ఏళ్ల పూర్తి చేసుకున్న వృద్ధులను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు అనేది చాలా విలువైనదని, దేశాభివృద్ధిని మార్చేది ఓటు మాత్రమే అన్నారు. ఏటా తహసీల్దార్ కార్యాలయంలో 18 ఏళ్లలో నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈడీటీ విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, వీఆర్వో లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.3.34 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.34 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,63,610 వసూలయ్యిందన్నారు. ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ.1,70,700 మేర వసూలైనట్లు తెలిపారు.